సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



వరప్రదం.. దేవర వృషభం

అన్నమయ్య జిల్లాలోని కొన్ని గ్రామాల్లో దేవ రెద్దు సంప్రదాయం కొనసాగుతోంది. దాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో పాటిస్తున్నారు. -8లో..



వీడిన హత్య కేసు మిస్టరీ

ప్రొద్దుటూరులోని సంజీవనగర్‌కు చెందిన రామాంజనేయులు (36) హత్యకేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. -10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/16.3

శనివారం జిల్లాలో 16.3 – 36.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జీఎన్‌ఎంగా శిక్షణకు కౌన్సెలింగ్

కడప రూరల్ : వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ జోన్‌–4 పరిధిలోని రాయలసీమ జిల్లాల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎంలకు ఏడాది పాటు జీఎన్‌ఎంలుగా శిక్షణకు సంబంధించిన కౌన్సెలింగ్ చేపట్టారు. జోన్ పరిధిలో సీనియారిటీ ప్రకారం 329 మందిని జీఎన్‌ఎంలుగా శిక్షణ పొందేందుకు అవకాశం కల్పించారు. దీనిపై కొంత మంది ఏఎన్‌ఎంలు అభ్యంతరం వ్యక్తం చేశారు. 15 ఏళ్లకు పైగా కాంట్రాక్టు ఏఎన్‌ఎంలుగా పని చేస్తున్న తమకు సీనియారిటీ జాబితాలో ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీనియారిటీ జాబితాను తయారు చేశామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు రామాంజనేయులు, అతావుల్లా, రఘు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్



పోలీస్ అధికారులతో ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా

ముద్దనూరు : స్థానిక అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌ను జిల్లాలోని ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కొత్తపల్లె గ్రామంలో ఓ బాలుడు అదృశ్యమైన కేసును విచారణ చేశారు. కేసుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ కేసుపై ఎస్‌ఐ చంద్రమోహన్‌తో వివరాలు సేకరించారు.

సాహితీ స్రవంతి కవితల పోటీ

కడప కల్చరల్ : సాహితీ స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో కవితల పోటీ నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా కన్వీనర్ లెనిన్ ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ప్రాంతానికి చెందిన సాహిత్యకారులు ఏదైనా సామాజిక అంశంపై 25 పంక్తులకు మించకుండా కవిత రాసి పంపాలని ఆయన సూచించారు. ఉత్తమ కవితకు కురుకూటి సుబ్బరాయుడు కవితా పురస్కారం అందజేస్తామన్నారు. ఈ పురస్కారం కింద రూ.2 వేల నగదుతోపాటు ప్రశంసాపత్రం ఇస్తామన్నారు. ఇతర ఉత్తమ కవితలకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.1000, రూ.500 ఇస్తామన్నారు. పోటీలో పాల్గొన్న అందరికీ ప్రత్యేక బహుమతి ఇస్తామని, ఆసక్తి గల వారు కవితలను పోస్టు ద్వారా మార్చి 10వ తేదీలోపుగా బండి ప్రసాద్, 100/41–3, విశ్వనాథపురం, ఎర్రముక్కపల్లె, కడప అనే చిరునామాకు పంపాలన్నారు. ఇతర వివరాలకు 9490660424 లేదా 94901 22229 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వివరించారు.

ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ మురళీకృష్ణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో జిల్లా ఎల్‌టీపీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీర్ల డిమాండ్లను ఏపీడీపీ ఎంఎస్ డైరెక్టర్, మున్సిపల్‌శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు. అనంతరం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కమలాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు కేవీఆర్ కృష్ణప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కుమార మంగళం, ట్రెజరర్ ఖాసిం, ఈసీ మెంబర్ జగన్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి గంజికుంట గణేష్ తదితరులు పాల్గొన్నారు.





గండికోటలో మౌలిక వసతుల కల్పనకు : రూ.150 కోట్లు

పర్యాటకాభివృద్ధికి కేటాయించిన భూమి: 1110 ఎకరాలు

నిర్మితం కానున్న స్టార్ హోటళ్లు: 7

ఏర్పాటు చేయనున్న విల్లాలు: 120

విల్లాల నిర్మాణానికి కేటాయించనున్న మొత్తం: రూ.250 కోట్లు

గండికోటకు కొత్తకళ

- ప్రపంచ స్థాయి పర్యాటక శోభ
- స్వదేశీ దర్శన్ కిందమౌలిక వసతులు
- విల్లాల నిర్మాణానికి స్థలం పరిశీలించిన ఒబెరాయ్ సంస్థ

సాక్షి ప్రతినిధి, కడప: చరిత్రాత్మక నిర్మాణమైన గండికోట, స్వదేశీ దర్శన్‌– 2.0 కింద ఎంపిక కావడంతో ప్రపంచస్థాయి పర్యాటక శోభ దక్కనుంది. వారసత్వ సంపదకు సజీవ సాక్ష్యంగా పర్యాటకులను ఆకట్టుకుంటున్న గండికోటను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు. అబ్బురపరిచే నిర్మాణాలు, కోట, ప్రాకారాలు, ఆలయాలు, గుర్రపుశాలలు, జైలు, ధాన్యాగారాలు, కోనేరు ఇలా ఎన్నో నిర్మాణాలను చేపట్టనున్నారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలో ఉన్న గండికోటను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రపంచంలో అత్యంత పేరు ప్రఖ్యాతులు గాంచిన ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు గండికోటలో 7 స్టార్ హోటల్ నిర్మించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఆ మేరకు స్థల పరిశీలన చేపట్టారు. 3 ప్రాంతాల్లో పర్యటించి తుదకు కోట సమీపంలో నిర్మించేందుకు ప్రతినిధి బృందం అంగీకారం తెలిపింది. మరోవైపు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యాటక సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గండికోట వద్ద 1110 ఎకరాలు భూమిని టూరిజం అభివృద్ధి కోసం కేటాయించింది.

రూ.150 కోట్లతో వసతుల కల్పన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో స్వదేశీ దర్శన్ ద్వారా రూ.150 కోట్లతో గండికోటలో పర్యాటక మౌలిక వసతులు కల్పించనున్నారు. ఇటీవల స్వదేశీ దర్శన్‌–2.0 పథకం క్రింద 36 పర్యాటక ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. రాష్ట్రంలో ప్రధానంగా అరకు, లంబసింగి సర్క్యూట్, గండికోట, హార్సిలీహిల్స్, తిరుపతి తదితర ప్రాంతాలకు చోటు కల్పించింది. ఆయా ప్రాంతాలల్లో అభివృద్ధి చేపట్టేందుకు కేంద్ర పర్యాటకశాఖ ప్రాజెక్టు డెవలప్‌మెంట్ కన్సల్టెంట్లను ఆహ్వానించింది. రాష్ట్ర పర్యాటకశాఖ ప్రాజెక్టు అమలు బాధ్యతలను అప్పగించి పూర్తి చేసేందుకు మార్గదర్శకాలను రూపొందించింది. సాంస్కృతిక, పౌర సమాజ స్థితిగతులు మెరుగుపర్చేలా ప్రణాళికలను సిద్ధం చేసింది.

120 విల్లాల నిర్మాణానికి సన్నాహాలు

ఒబెరాయ్ సంస్థ గండికోటలో రూ.250 కోట్లతో 120 విల్లాలు నిర్మించేందుకు ఆసక్తి ప్రదర్శిస్తోన్నట్లు యంత్రాంగం వివరిస్తోంది. మరోవైపు స్వదేశీ దర్శన్ ద్వారా పర్యాటల కోసం వాచ్‌టవర్లు, రిసార్ట్స్, వసతి గదులు, కన్వెన్షన్ సెంటర్లు, అడ్వెంచర్ క్రీడలు, గోల్ఫ్ కోర్టులు, యాంపీ థియేటర్లు, సాంస్కృతిక భవనాలు, సౌండ్ లైట్ షోలు, అందుబాటులోకి రానున్నాయి. కళాకారులు, చేతివృత్తి కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేలా వారి కోసం ప్రత్యేక దుకాణ సముదాయాలను నిర్మించనున్నారు. ఏకో ఫ్రెండ్లీ ట్రాన్స్‌పోర్టు, ల్యాండ్ స్కేప్, డిజిటల్ టెక్నాలజీ, స్థానిక కాలనీలల్లో మౌలిక వసతులు సమకూరనున్నాయి.

జాతీయ స్థాయి గుర్తింపు



గండికోట అభివృద్ధితో వైఎస్సార్ జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించనుంది. త్వరలో కోట పర్యాటకులతో కళకళలాడుతూ దేశానికే గర్వకారణంగా నిలవనుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతోనే అభివృద్ధి పనులు జోరందుకున్నాయి.

–ఎస్.ఎలియాస్‌రెడ్డి, కన్వీనర్, ఇంటాక్, కడప

దేశంలో నంబర్ వన్‌గా నిలుస్తుంది



గండికోట త్వరలో దేశంలోనే నంబర్ వన్ పర్యాటక ప్రాంతంగా నిలవనుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో అంతర్జాతీయ ఒబెరాయ్ 7స్టార్ హోటల్, విల్లాలు ఏర్పాటు కానున్నాయి. స్వదేశీ దర్శన్ ద్వారా పలు పథకాల ద్వారా మరింత అభివృద్ధి చెందనుంది. ఒకప్పుడు ఫ్యాక్షన్ ముద్రతో ఆ సంస్కృతినే తెరపైకి ఎక్కిస్తున్న సినిమా ప్రముఖులు సాంస్కృతిక రంగాన్ని ఆవిష్కరించాల్సిన పరిస్థితి గండికోట కల్పించనుంది.

– కొండూరు జనార్దన్‌రాజు, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, కడప

న్యాక్‌లో నూతన శిక్షణ కార్యక్రమాలు

పులివెందుల రూరల్ : న్యాక్ శిక్షణ కేంద్రంలో త్వరలో నూతన శిక్షణ కార్యక్రమాలను ప్రారంభిస్తామని డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక న్యాక్ శిక్షణ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ప్రతి శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన ట్రైనీలతో శిక్షణ జరిగే విధానంపై అడిగి తెలుసుకున్నారు. త్వరలో స్కిల్ కళాశాల ద్వారా నూతన శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సీడాప్ జేడీఎం వేణు మాధవ్, ఏపీఎస్ ఎస్‌డీసీ మేనేజర్ నాగార్జున, న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్, సీడాప్ సిబ్బంది, న్యాక్ ఇన్‌చార్జి చెన్నకేశవులు, న్యాక్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలు బలోపేతం కావాలి

డ్వాక్రా సంఘాలు ఏ గ్రేడ్ సాధించి బలోపేతం కావాలని డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని డీఆర్డీఏ కార్యాలయంలో కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎం ఆంజనేయులు, జేఆర్పీలు దివాకర్, ఆంజనేయులు, సీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమాజంపై అవగాహన అవసరం

వల్లూరు: విద్యార్థులకు చదువుతోపాటు సమాజంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో వల్లూరులోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో జిల్లాలోని ఆరు కేజీబీవీలకు చెందిన ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులకు శనివారం కసూర్తి అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు జీవన నైపుణ్యాల పెంపుదలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో వారి కాళ్ల మీద వారు బతికే విధంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రూమ్ టు రీడ్ ప్రోగ్రాం ఆఫీసర్ సదాశివారెడ్డి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి విజయలక్ష్మి, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ రజనీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నసీమున్నీసా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- ఎమ్మెల్సీ ఎన్నికలపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమన్వయ సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ పరిశీలకులు

కడప కార్పొరేషన్ : పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. శనివారం కడపలోని ఆదిత్య కల్యాణ మండపంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నందున వెంటనే ఓటర్లందరినీ కలిసి పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తటస్థంగా ఉన్న ఓటర్లను పార్టీ వైపు తిప్పుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులంతా విజయం సాధించారని, పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికల్లో కూడా గెలిస్తే ప్రభుత్వ మైలేజీ పెరుగుతుందన్నారు. ఇందుకోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పరిశీలకులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేలకు పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఓటర్ల జాబితాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, రమేష్ యాదవ్, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, పి. రవీంద్రనాథ్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, డాక్టర్ దాసరి సుధ, మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి, బి.నిత్యానందరెడ్డి, అఫ్జల్‌ఖాన్, ఎస్‌ఏ కరిముల్లా, పులి సునీల్‌కుమార్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈ నెల 26వ తేదీ ఆదివారం సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.మునిశంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పదికి ప్రత్యేక ప్రణాళిక

- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అడుగులు
- ప్రారంభమైన వంద రోజుల ప్రణాళిక
- ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్
- రోజూ మోడల్ పరీక్ష, వెంటనే ఫలితాల ప్రకటన
- నైట్ విజన్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు
- వెనుకబడిన విద్యార్థులపై నిరంతర పర్యవేక్షణ



మోడల్ పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా విద్యా శాఖ అడుగులు వేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేస్తోంది. ఇందుకోసం డిస్ట్రిక్ కామన్ ఎక్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) సబ్జెక్టు నిపుణులతో ప్రత్యేక మెటీయల్‌ను సిద్ధం చేసింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసింది. అలాగే జనవరి 1వ తేదీ నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు ప్రారంభించింది. దీంతోపాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు నైట్ విజన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

సబ్జెక్టుల్లోని అనుమానాలు నివృత్తి

వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రోజూ ఉదయం 8 నుంచి 10.45 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 3.30 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. మిగతా మధ్య సమయంలో రెగ్యులర్ స్టడీ తరగతులు ఉంటాయి. విద్యార్థులకు సబ్జెక్టుల్లోని అనుమానాలను నివృత్తి చేస్తూ ముందుకు సాగుతున్నారు. పరీక్ష అనంతరం సమాధాన పత్రాన్ని మూల్యాంకనం చేసి అదే రోజు ఫలితాలు తెలియజేస్తారు. తక్కువ మార్కులు వచ్చిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

589 స్కూళ్లు.. 28,368 మంది విద్యార్థులు

ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. జిల్లాలో 589 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 28,273 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రెగ్యులర్ 27,300 మంది, ప్రైవేటు విద్యార్థులు 973 మంది ఉన్నారు.

విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలన

పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నైట్ విజన్ పేరుతో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్నారు. చదువుతున్నారా లేదా అని ఆరా తీస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. టీవీలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని చెబుతున్నారు.

వివిధ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు

మేనేజ్‌మెంట్	స్కూల్స్	రెగ్యులర్	ప్రైవేటు	మొత్తం
ఎయిడెడ్	24	867	80	947
బీసీ వెల్ఫేర్	4	188	1	189
గవర్నమెంట్	10	673	42	715
కేజీబీవీ	17	592	2	594
మున్సిపాలిటీ	17	1752	198	1950
మోడల్	3	263	1	264
ప్రైవేటు	291	12361	201	12562
ఏపీఆర్ఎస్	3	159	1	160
సోషల్ వెల్ఫేర్	13	835	10	845
ట్రైబల్ వెల్ఫేర్	5	104	4	108
జెడ్పీ	202	9505	433	9939
మొత్తం	589	27300	973	28273

ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లాం



మా పాఠశాల పరిధిలో 97 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వారందరి ఇళ్లకు వెళ్లి నైట్ విజన్ చేశాం. రెండవ సారి కూడా సగం మంది ఇంటికి వెళ్లాం. నా తోటి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల ఇళ్లకు చెప్పకుండా వెళ్తున్నాము. – మేరీ, హెచ్‌ఎం, గంగాభవాని బాలికల హైస్కూల్, కడప

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో సమష్టిగా కృషి చేస్తున్నాం. వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. దీంతోపాటు వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పాఠశాలలను విద్యా శాఖ అధికారులు తరచూ తనిఖీలు చేస్తున్నారు.

– దేవరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి, కడప

వరప్రదం.. దేవర వృషభం

- అన్నమయ్య జిల్లాలో అనాదిగా వేళ్లూనుకున్న దేవరెద్దు ఆచారం
- దేవరెద్దులతో గ్రామాలు సుభిక్షం అనే నమ్మకం
- ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణ
- పుట్టినా, గిట్టినా వేడుకలు
- ఎద్దుల సంరక్షణ కోసం నలుగురు భక్తులు

(షేక్ ముజుబుద్దీన్, సాక్షి, కడప డెస్క్)

దేవరెద్దులు.. అన్నమయ్య జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తాయి. అనాదిగా వస్తున్న ఆచారానికి ఇవి ప్రతీకలుగా ఉంటున్నాయి. గ్రామానికి శుభం చేకూరుస్తాయనే ప్రజల నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

కేవీ పల్లెలో.. అధిక సంఖ్యలో..

అన్నమయ్య జిల్లాలోని కేవీపల్లె, కురబలకోట, కలికిరి, సంబేపల్లె మండలాల్లో ప్రధానంగా దేవరెద్దుల సంస్కృతి ఉంది. కేవీపల్లె మండలంలో 12 గ్రామాల్లో ఒక్కో దేవరెద్దు చొప్పున ఉన్నాయి. **తోటి దళి**తవాడ, నారమాకుపల్లె, గొర్లకణంపల్లె, గుట్టలపై బండకాడపల్లె, దిగువగడ్డ, పెండ్లిపెంట, పేయలవారిపల్లె, తీతవగుంటపల్లె, తువ్వపల్లె, బొప్పసముద్రం, తిమ్మాపురం, వంకవడ్డిపల్లెలో దేవరెద్దులు ఉన్నాయి. సంబేపల్లె మండలంలో అన్నప్పగారిపల్లె, శెట్టిపల్లె, గున్నికుంట్ల, గురిగింజకుంట, కలకడ మండలంలో పాళెంమూల, బాలయ్యగారిపల్లె పంచాయతీ నాయనవారిపల్లె, **కలికిరి** మండలంలో అద్దవారిపల్లెలోనూ **దేవరెద్దులు** ఉన్నాయి. కురబలకోట మండలంలో కూడా అక్కడక్కడా ఉన్నాయి. కాగా.. ఒకటి, రెండు గ్రామాల్లో మాత్రమే కొత్తగా దేవరెద్దులు పుట్టాయి.

దేవరెద్దు అంటే..

ఏ గ్రామంలో అయినా పుట్టిన దూడ వారం రోజులైనా పాలు తాగకుండా ఉంటే.. దాన్ని దేవాలయం వద్దకు తీసుకెళ్లి ప్రసాదం పెడతారు. అది తింటే దానిని దేవరెద్దుగా పరిగణిస్తారు. దానిని సంరక్షించుకుంటే గ్రామాలకు శుభం కలుగుతుందని నమ్ముతారు.

గ్రామాలు సస్యశ్యామలం

దేవరెద్దులు కలిగిన గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయని నమ్మకం. దేవరెద్దును పోషిస్తున్న భక్తుల వంశాభివృద్ధి చెంది, సుఖసంతోషాలతో ఉంటారని విశ్వాసం. దాన్ని మేపడానికి వదిలేసినప్పుడు ఏ పొలంలో అయినా మేయవచ్చు. అది మేసిన పొలం యజమానులు తమ అదృష్టంగా భావిస్తారు. అలాగే గ్రామస్తులు తమకు తోచిన పదార్థాలను ప్రసాదంగా దేవరెద్దుకు అందజేస్తుంటారు. దేవరెద్దు మృతి చెందితే ఆ ఊరికి, గ్రామస్తులకు అరిష్టం జరుగుతుందనే భయంతో తక్షణం కొత్తదాన్ని ఎంపిక చేస్తారు.

విశేషాల సమాహారం

దేవరెద్దు పుట్టినప్పటి నుంచి గిట్టే వరకు ఎన్నో వేడుకలు నిర్వహిస్తారు. వీటిని సంరక్షించేందుకు ప్రత్యేకంగా దేవరభక్తులుంటారు. తిరునాల, ఉత్సవాల సందర్భంగా వీటిని అలంకరించి సంబరాలు చేసుకుంటారు. దేవరెద్దును దేవుడిలా పూజిస్తారు. దీనిపై ఎవ్వరూ దెబ్బ వేయరు. ఇది చనిపోయినా.. కొత్త దేవరెద్దును, దేవరభక్తులను ఎంపిక చేయాలన్నా వేడుక నిర్వహిస్తారు. బంధుమిత్రులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల వారు కూడా తరలివస్తారు. సంప్రదాయ వాయిద్యాలతో పాటు మద్దిళ్లు, కొమ్ములు ఊదడం, పలకలు కొట్టడం లాంటివి చేస్తారు. కొత్త ఎద్దును ఎంపిక చేసిన తర్వాత దానికి సంప్రదాయ అలంకరణ అనంతరం ఊరేగిస్తారు.

> సంస్కృతి, సంప్రదాయాలకు పట్టుగొమ్మలు గ్రామసీమలు. అవి సంబరాలకు నెలవులు. విశిష్ట ఆచారాలకు పుట్టినిళ్లు. అలాంటి గ్రామాల్లో కొనసాగుతున్న ఒక అరుదైన విశేషమే.. దేవరెద్దు, దేవరభక్తుల పరంపర..



కలకడ మండలంలోని బహదానది వద్దకు ఝురి ఉత్సవంలో దేవరెద్దులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు, గ్రామస్తులు (ఫైల్)

ఉత్సవాలకు ఊరేగింపుగా..

దేవరెద్దు ఉన్న ఊళ్లతో పాటు సమీప ప్రాంతాల్లో ఎక్కడ ఉత్సవాలు జరిగినా వీటిని ప్రత్యేకంగా ఊరేగింపుగా తీసుకెళతారు. ప్రధానంగా శివరాత్రి సందర్భంగా జరిగే ఝురి ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా ఇవి నిలుస్తాయి. ఆ రోజున జాగరణ నిర్వహించిన ప్రజలు మరుసటి రోజు ఉదయాన్నే ఝరికోనలో స్నానమాచరిస్తారు. అక్కడికి దేవరెద్దును, నాణ్యాలు(దేవరెద్దు పూజసామగ్రి)ని ఊరేగింపుగా తీసుకెళ్తారు. ఈ కార్యక్రమం ఎంతో వైభవంగా జరుగుతుంది. దీనిని చూడటానికి జనం పెద్ద ఎత్తున తరలివస్తారు.

దేవరెద్దు చనిపోతే...

ఎక్కడైనా దేవరెద్దు చనిపోతే అంత్యక్రియలు వేడుకలా నిర్వహిస్తారు. అడవికి వెళ్లి పచ్చారు కొయ్యలు తెస్తారు. వాటితో విశ్వబ్రాహ్మణుల ద్వారా ప్రత్యేకంగా రథం తయారు చేయిస్తారు. ఎద్దు ప్రాణంతో ఉన్నప్పుడు ఎలా పడుకుని ఉంటుందో.. ఆ విధంగా రథంలో ఉంచుతారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి ఊరేగింపుగా తీసుకెళ్తారు. చెక్కభజనలు, పిల్లనగ్రోవి, డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా సేవ చేస్తారు. భూమిలో గుంత తీసి ఖననం చేసే సమయంలో కూడా ఎద్దును కూర్చున్న స్థితిలోనే ఉంచుతారు. ఈ కార్యక్రమం ఒక తిరునాళ్లలా జరిపిస్తారు. దీనికి ఇతర గ్రామాల్లోని దేవరెద్దులు, దేవరభక్తులు కూడా తరలివస్తారు.

కొత్త దేవరెద్దు ఎంపిక ఇలా..

దేవరెద్దు చనిపోయిన స్థానంలో కొత్త దాన్ని ఎంపిక చేసేందుకు గ్రామస్తులంతా పూజలు నిర్వహిస్తారు. గ్రామంలో పండ్లు, ప్రసాదాలు పెట్టి దూడలు, ఎద్దులను ఒక చోట వదులుతారు. ఏది అయితే ప్రసాదం స్వీకరిస్తుందో.. దాన్ని దేవరెద్దుగా పరిగణిస్తారు. కొత్తగా దేవరెద్దు ఎంపికై న అనంతరం మూడేళ్లకు తిరునాల నిర్వహిస్తారు. దానికి మిగతా గ్రామాల్లోని దేవరెద్దులను కూడా ఆహ్వానిస్తారు. గ్రామానికి వచ్చిన వాటికి మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలుకుతారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాలు చేసుకుంటారు.

దేవర భక్తులు.. సదా సంరక్షకులు

గ్రామంలో దేవరెద్దును సంరక్షించడానికి, పూజలు చేయడానికి, ఉత్సవాలకు తీసుకు వెళ్లడానికి నలుగురు వ్యక్తులుంటారు. వీరిని దేవర భక్తులు అంటారు. ఎక్కువగా ఏళ్ల తరబడి ఒకే కుటుంబ సభ్యులు దేవరెద్దు భక్తులుగా ఉంటారు. వారిని ఎద్దు భక్తుడు, కదిరి భక్తుడు, గుర్రప్పభక్తుడు, పూల భక్తుడిగా పిలుస్తారు.

సండే స్పెషల్

నియమానుసారం..

దేవరభక్తులను నియమించడానికి గ్రామస్తులు స్నానం ఆచరించి నిర్దేశిత ప్రాంతానికి చేరుకుంటారు. ప్రతి ఒక్కరూ చేతిలో పండ్లు, ప్రసాదం పట్టుకుని కూర్చుంటారు. దేవరెద్దును తీసుకొచ్చి అక్కడ వదిలేస్తారు. మొదటిసారి ఎవరి ప్రసాదం స్వీకరిస్తే వారిని ఎద్దుభక్తుడిగా ఎంపిక చేస్తారు. ఈ విధంగా వరుసగా కదిరిభక్తుడు, గుర్రప్ప భక్తుడు, పూల భక్తుడులను నియమిస్తారు.

- దేవరభక్తుడు దేవరెద్దుకు పూజలు చేయడంతో పాటు ఉత్సవాలకు తీసుకెళ్లాలంటే ప్రత్యేకంగా అలంకరించాల్సి ఉంటుంది. కర్రి (బెత్తం) చేతపట్టుకుని దేవరెద్దుతో పాటు ఊరేగింపుగా వెళతాడు.
- కదిరి భక్తుడు నరసింహస్వామికి పూజలు చేయాల్సి ఉంటుంది. ఉత్సవాలకు నరసింహస్వామి చిత్రపటంతో వెళతాడు.
- గుర్రప్పభక్తుడు ఎద్దుకు సంబంధించిన ఆభరణాలు, ఉత్సవ సామగ్రి, గుర్రప్పస్వామి శిలతో కూడిన ఓ పెట్టెను ఎత్తుకుని వెళ్లాల్సి ఉంటుంది.
- పూల భక్తుడు ఏదైనా ఉత్సవాలు, తిరునాళ్లు జరిగినప్పుడు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి భక్తులను ఆహ్వానించాల్సి ఉంటుంది.

భక్తిశ్రద్ధలు, నియమనిష్టలు ముఖ్యం

దేవరెద్దు భక్తులు భక్తిశ్రద్ధలతో మెలగాల్సి ఉంటుంది. ఎక్కడపడితే అక్కడ భుజించరాదు, నీరు తాగరాదు. భోజనం చేయాలంటే వండిన వంటలో మొదటి సారి వీరు తిన్న తరువాతనే మిగతా వారు భుజించాల్సి ఉంటుంది. దేవరెద్దుకు నైవేద్యం పెట్టిన తర్వాతనే వీరు భోజనం చేస్తారు.

ప్రతి శనివారం పూజలు

దేవరెద్దుకు ప్రతి శనివారంతో పాటు మహాశివరాత్రి, మొలకల పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాలు, తిరునాళ్లకు దేవరెద్దుతో పాటు నాణ్యాలు (పూజా సామగ్రి), గొడుగులు, పిల్లనగ్రోవి, డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో తీసుకెళతారు.



దేవరెద్దులను తీసుకెళ్తున్న దేవరెద్దు భక్తులు (ఫైల్)



ఒక్క పొద్దు విడుస్తున్న భక్తులు (ఫైల్)

పూజ సామగ్రి కోసం దేవరిల్లు

దేవరెద్దు కోసం ప్రత్యేకంగా ఇల్లు ఏర్పాటు చేస్తారు. దానిని దేవరిల్లు అంటారు. అందులో దేవుని చిత్రపటాలు ఉంచుతారు. దేవరెద్దు అక్కడే ఉంటుంది. దానికి అలంకరణ సామగ్రి కోసం ప్రత్యేకంగా పెట్టె ఉంటుంది. గంట, గజ్జెలు, మువ్వలు, మల్లముట్లు, గొడుగులు, వస్త్రం తదితరాలుంటాయి. వాటిని దేవరింటిలో భద్రపరుస్తారు.

దేవరింటిలో ఎద్దు వద్ద పిల్లన గ్రోవి ఊదుతున్న భక్తులు



నిష్టగా ఉంటాం



మేము చాలా నిష్టగా ఉంటాం. భక్తుడిగా నియమించినప్పటి నుంచి ఎద్దు బాగోగులు నేనే చూసుకుంటున్నా. 25 ఏళ్లగా మా వంశస్తులే దేవరెద్దు భక్తులుగా ఉన్నాం. దేవరెద్దు భక్తులతో పాటు ఇతర భక్తులు దేవరెద్దుకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

– యల్లయ్య, వీఆర్‌ఓ, ఎద్దు భక్తుడు, తోటిదళితవాడ, కేవీపల్లె మండలం.

పురాతనకాలం నుంచి వస్తున్న ఆచారం



మా గ్రామంలో దేవరెద్దును సంరక్షించడం, పూజలు నిర్వహించడం పురాతన కాలం నుంచి ఆచారంగా వస్తోంది. కొన్ని కట్టుబాట్లు పాటిస్తూ దేవరెద్దును సంరక్షించడం జరుగుతోంది.

– నాగులయ్య, గుర్రప్ప భక్తుడు, తోటిదళితవాడ, కేవీపల్లె మండలం

అదృష్టంగా భావిస్తున్నాం



దేవరెద్దు రూపంలో దేవుడే ప్రత్యక్షంగా కన్పిస్తున్నాడు. అలాంటి దేవరెద్దుకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. పండుగలు, ఉత్సవాలతోపాటు ప్రతి శనివారం క్రమం తప్పకుండా పూజలు నిర్వహిస్తాం.

– నాగరాజ, పూల భక్తుడు, తోటిదళితవాడ, కేవీపల్లె మండలం

ఒక్కపొద్దు పాటిస్తున్నాం



ప్రతి శనివారం, పండుగల సమయంలో మేము ఒక్కపొద్దు పాటిస్తాం. దేవరింటిలో పూజలు నిర్వహించడంతో పాటు అక్కడే భోజనం వండుకుని దేవరెద్దుకు పూజలు నిర్వహించిన తరువాతనే ఒక్కపొద్దు విడుస్తాం.

– శశికుమార్, కదిరి భక్తుడు, తోటిదళితవాడ, కేవీపల్లె మండలం

గౌరవంగా చూసుకుంటాం



దేవరెద్దు సంప్రదాయం పెద్దల కాలం నుంచి వస్తోంది. ఎద్దును గౌరవంగా చూసుకుంటున్నాం. మాలో ఎవరైనా చనిపోతే కొత్త భక్తుడిని దేవరెద్దే ఎంపిక చేసుకుంటుంది.

– కె.వంశీ, దేవరభక్తుడు, దిగువబోయపల్లె, కురబలకోట మండలం

40 ఏళ్లుగా..



దేవరెద్దును దేవుడితో సమానంగా చూస్తారు. పండుగలు, ఉత్సవాల సందర్భాల్లో అలంకరించి ఊరేగిస్తారు. 40 ఏళ్లగా భక్తుడిగా ఉన్నా.

– శిద్దప్ప, దేవరభక్తుడు, మంద్యంవారిపల్లె, కురబలకోట మండలం

వ్యక్తి ఆత్మహత్య

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చినవైనం
- సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రామకృష్ణ నగర్‌లో సద్దల మహేష్‌గౌడ్ (35) అనే వ్యక్తి తాను నివసిస్తున్న ఇంటిలోనే ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్ కొక్కేనికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన జరిగి ఏడు రోజులు అయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి సంఘటన స్థలంలోనే రిమ్స్ వైద్య సిబ్బందిచేత పోస్టుమార్టం చేయించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మృతుని తల్లి ఈశ్వరమ్మ కొన్ని రోజుల క్రితం కంటి ఆపరేషన్ చేయించుకుని కుమార్తె దగ్గర ఉంటోంది. మహేష్ గౌడ్‌కు భార్య రాజేశ్వరి, ఇద్దరు సంతానం వున్నారు. గత నెల 30వ తేదీ న రాజేశ్వరి తన పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. మహేష్ గౌడ్ బేల్దారి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈనెల 19వ తేదీన తల్లి వద్దకు వెళ్లి వచ్చాడు. ఎప్పుడైనా బేల్దారి పనికి వేరే ఊళ్లకు వెళితే వారం, 10 రోజుల తరువాత ఇంటికి వస్తాడనీ, ఆ క్రమంలో మహేష్ గురించి తాము పట్టించుకోలేదని అతడి తల్లి తెలియజేసింది.

కాగా ఈనెల 24న రాత్రి ఇంటిలో నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వాళ్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నారాయణ, సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

బస్సును ఢీకొన్న బైకు

పులివెందుల రూరల్ : పట్టణంలోని పాల్‌రెడ్డి ఫంక్షన్ హాలు సమీపంలో శనివారం ఆర్టీసీ బస్సును బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండలం ఈదులపల్లె గ్రామానికి చెందిన సతీష్ అనే వ్యక్తి పని నిమిత్తమై ద్విచక్ర వాహనంలో పాత ఆర్టీసీ బస్టాండు వైపు వెళుతుండగా.. ఆర్టీసీ పల్లె వెలుగు బస్సును బైకు ఢీకొంది. దీంతో సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు కడప రిమ్స్‌కు రెఫర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కమలాపురం : కమలాపురం పట్టణానికి చెందిన ఓ మహిళను మండల పరిధిలోని జంగంపల్లెకు చెందిన రాపూరి శివరామక్రిష్ణ ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేశాడని, బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. శనివారం ఆయన తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. జంగంపల్లెకు చెందిన శివరామక్రిష్ణ పట్టణానికి చెందిన ఓ మహిళను గత కొంత కాలంగా ప్రేమ పేరుతో వెంటబడుతూ వివాహం కూడా చేసుకుంటానని నమ్మించాడు. కొంతకాలం ఆమెతో సన్నిహితంగా మెలిగాడు. తీరా తనను వివాహం చేసుకోవాలని ఆ మహిళ అడుగుతుండటంతో అతడు మొహం చాటేశాడు. దీంతో బాధిత మహిళ ఫిర్యాదు మేరకు శివరామక్రిష్ణ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముక్కొండపై వ్యక్తి ఆత్మహత్య

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ముక్కొండపై కృష్ణయ్య అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండు రోజులుగా కృష్ణయ్య కనిపించడం లేదని వెతుకుతూ వచ్చిన కుటుంబ సభ్యులు అతను ముక్కొండపై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు శనివారం సాయంత్రం గుర్తించారు. మైదుకూరు అర్బన్ పోలీసులకు సమాచారం అందించారు.

గువ్వల చెరువు ఘాట్‌లో లారీలు ఢీ

– ఇద్దరు డ్రైవర్లకు గాయాలు

చింతకొమ్మదిన్నె : గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో గల నాల్గవ మలుపు వద్ద రెండు లారీలు ఢీ కొన్నాయి. సికెదిన్నె ఎస్‌ఐ బి. అరుణ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శనివారం కడప వైపు నుంచి రాయచోటికి వెళ్తున కంటైనర్ లారీని రాయచోటి నుంచి కడప వైపునకు వస్తున్న ఫ్లైయాష్ ట్యాంకర్ లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయన్నారు. ఈ ప్రమాదంలో రెండు లారీలలోని హేమంత్, పబ్బన్ అనే ఇరువురు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. కాగా ఈ ఘటనతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ఎస్‌ఐ అరుణ్ రెడ్డి తమ సిబ్బందితో నాలుగు గంటల పాటు శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

రైలు కింద పడి వృద్ధుడి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కనుమలోపల్లె-భాకరాపేట స్టేషన్ల మధ్య ఓ వృద్ధుడు రైలులో నుండి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లు కడప రైల్వే ఎస్‌ఐ రారాజు తెలిపారు. మృతుడికి 60 సంవత్సరాలు ఉంటాయని, ఎక్కడి నుంచి వచ్చింది తెలియదన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించామని, మృతుడికి సంబంధించిన వారు రైల్వే ఎస్‌ఐ సెల్ నెంబరు 9440 646974 నెంబరులో సంప్రదించాలన్నారు.